www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 10 నవంబర్ 2024

5

కాకినాడ



ప్రవేశాలకు మరోసారి గడువు పెంపు

ప్రజాశక్తి- పెద్దాపురం



రామకృష్ణయ్య

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి జరిగే ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 19వ తేదీ వరకూ పొడిగించినట్లు ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో రెండు రోజులపాటు దరఖాస్తులలో తప్పులను సరిదిద్దుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మిడ్డే మీల్స్ సిబ్బందికి వేతనాలు నిల్

- మూడు నెలల నుంచి రాని బిల్లులు
- అరకొర వేతనాలతో అవస్థలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వైసిపి హయాంలో ఉన్న జగనన్న గోరుముద్ద పథకాన్ని కూటమి సర్కారు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంగా మార్చారు. నాణ్యమైన ఆయిల్ వినియోగించాలని సందర్భం వచ్చినప్పుడల్లా కూటమి నేతలు సెలవిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ మధ్యాహ్న భోజనం పథకంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుతం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాకినాడ జిల్లాలో పలు మండలాల్లో మిడ్డే మిల్ వర్కర్లకు 3 నెలలుగా వేతనాలు అందడం లేదు. ఇప్పటికే అరకొర వేతనాలతో నెట్టుకొస్తున్న కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు వంట బిల్లుల సైతం పెండింగ్‌లో ఉండడంతో కిరాణా దుకాణాల వద్ద అరువులు తీసుకొచ్చి సరుకులు తెచ్చి వండి వడ్డిస్తున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. బిల్లులు వచ్చిన తర్వాత దుకాణ యజమానులకు వడ్డీలతో సహా చెల్లించే దుస్థితి ఏర్పడిందని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ జిల్లాలో 1,253 పాఠశాలల్లో 1,33,258 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రైమరీ విద్యార్థులు 36,832 మంది, యుపి విద్యార్థులు 9,552, హైస్కూలు విద్యార్థులు 86,874 మంది ఉన్నారు. జిల్లాలో సుమారు 2,535 మంది కార్మికులు ఉన్నారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడం, వారిని ఆకలి బాధ నుంచి దూరం చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్యను పెంచే లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వీరంతా సమర్థవంతంగా అమలు జరిగేలా కృషి చేస్తున్నారు.

మూడు నెలల వేతనాలు పెండింగ్



గతంలో ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్ర సందర్భంగా మధ్యాహ్న భోజన పథక కార్మికులకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేకపోయారు. ఐదేళ్ల పాటు కేవలం రూ.3 వేల వేతనంతోనే కార్మికులు నేటికీ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వాస్తవానికి స్కీమ్ వర్కర్లకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని చట్టం చెబుతున్నా ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకుంటూ అరకొర జీతాలే ఇస్తున్నది. ఇప్పుడు ఇస్తున్న జీతాలను కూటమి ప్రభుత్వం మూడు నెలలుగా పెండింగ్లో ఉంచింది. నెలకు రూ.76.5 లక్షలు వేతనాలుగా ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో అనేకమంది వర్కర్లకు 3 నెలలుగా వేతనాలు అందడం లేదు. ఇలా ఒక్కొక్కరికీ రూ.9 వేల చొప్పున మొత్తంగా రూ.2 కోట్ల 28 లక్షల 15 వేలు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులను వివరణ కోరితే రెండు నెలల బిల్లులు ఇప్పటికే అప్ లోడ్ చేశామని, కేవలం ఒక నెల మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పుకొస్తున్నారు.

విడుదల కాని బిల్లులు

పిల్లలకు భోజనాలు వండి వడ్డించేందుకు కిరాణా సరుకులు తెచ్చేందుకు కార్మికులు నానా తంటాలూ పడుతున్నారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. సుమారు మూడు నెలలుగా వివిధ కారణాలతో బిల్లులు చెల్లించడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పథకాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కిరాణా వర్తకులు వద్ద అరువు తెచ్చి వంట చేసే పరిస్థితి ఏర్పడింది. నెలకు రూ.73.73 లక్షలు విడుదల కావాల్సి ఉంది. ఇలా మూడు నెలలకు రూ.2 కోట్ల 21 లక్షల 21 వేల 229 పెండింగ్ ఉన్నట్లు కార్మికులు తెలిపారు. తక్షణమే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరుతున్నారు. మరోవైపు నెలకు గుడ్డు బిల్లులు రూ.1.10 కోట్లు, చిక్కీల బిల్లులు రూ.45 లక్షలు ఖర్చు అవుతుండగా రెండు నెలలుగా కాంట్రాక్టర్లకు ఈ బిల్లులు చెల్లించడం లేదు.

పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి



ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి పిల్లలకు భోజనం వండి వడ్డిస్తున్న కార్మికులను ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తోంది. పథకం పేరు మార్చినప్పటికీ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సకాలంలో వేతనాలు బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్పందించి పథకం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- ఎన్.ఈశ్వరి, జిల్లా కార్యదర్శి, మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్

అప్పులు చేసి వండి పెడుతున్నాం



ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. గత మూడు నెలలుగా కిరాణా దుకాణాల వద్ద అప్పులు చేసి సరుకులు తీసుకొస్తున్నాం. ఇచ్చే అరకొర వేతనాలు 3 నెలలుగా ఇవ్వడం లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

- వరలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలు, గజ్జినపూడి, ప్రత్తిపాడు మండలం.



ఖాళీ కంచాలతో నిరసన వ్యక్తం చేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లు

ఖాళీ కంచాలతో క్లాప్ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

బకాయి జీతాలు చెల్లించాలని క్లాప్ డ్రైవర్లు చేపట్టిన ఆందోళన 16వ రోజుకు చేరింది. శనివారం స్థానిక భానుగుడి సెంటర్లో ఖాళీ కంచాలతో క్లాప్ డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ మాట్లాడుతూ గత 16 రోజుల నుంచి పలు రూపాల్లో ఆందోళన చేపడుతున్న జీతాలు విడుదల విషయంలో అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. మూడు నెలల నుంచి జీతాలు లేక కుటుంబాలను పోషించు కోవ డం కష్టతరమై తినడానికి తిండి లేదని ఖాళీ కంచా లను వాయిస్తూ నిరసన తెలియ జేశామన్నారు. ఈ నిరసన ద్వారానైనా అధికారుల్లో చలనం రావా లని అన్నారు. ఇదే వైఖరితో అధికారులు వ్యవ హరిస్తూ ఉంటే సోమవారం నుంచి ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 9 నెలల నుంచి కట్ చేసిన పీఎఫ్ సొమ్ము ఖాతాకు జమ చేయకుండా ఉంటే పీఎఫ్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే కాంట్రాక్టర్‌తో మాట్లాడి కట్ చేసిన పీఎఫ్ సొమ్మును కార్మికుల ఖాతాకు జమ చేయించే విధంగా చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, కొండబాబు, రాజు, గంగాధర్, దుర్గాప్రసాద్, దుర్గ బాబు, వీరబాబు, భద్ర, విక్టర్ పాల్గొన్నారు.

సిపిఎం ప్రజా పోరు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం గోడపత్రికను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ మోడీ పాలనలో మహిళలు, చిన్నా రులపై హత్యాచారాలు పెరుగుతున్నాయని విమర్శిం చారు. దేశంలో పెద్దఎత్తున నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందని అన్నారు. ఎన్నికల ముందు కూట మి పార్టీలు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 14వ తేదీ వరకూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని కరపత్రాలు పంచుతూ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. 14వ తేదీన మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలలో ప్రజలు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.వీరబాబు, టి.రాజా పాల్గొన్నారు.

తుమ్మలకు కుడా ఛైర్మన్

ప్రజాశక్తి - పెద్దాపురం



పవన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తుమ్మల

మండలంలోని పులి మేరు గ్రామానికి చెందిన జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామ స్వామిని కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథా రిటీ(కుడా) ఛైర్మన్‌గా కూటమి ప్రభుత్వం నియ మించింది. దీంతో జనసైనికులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం స్థానిక మెయిన్ రోడ్ ఆంజనేయ స్వామి గుడి సెంటర్‌లో జన సైనికులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల రామస్వామి కుమారులు అంజేష్‌బాబు, రేశ్వంత్ రాయ్ పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌ని కలిసిన తుమ్మల

తనను కుడా ఛైర్మన్‌గా నియమించినట్లు సమా చారం అందుకున్న తుమ్మల హుటాహుటీని మంగళగిరి వెళ్లి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

ప్రజాశక్తి - ఏలేశ్వరం



బాధితులను ఓదార్చుతున్న ఎంఎల్ఎ సత్యప్రభ

ఏలేరు నదిలో బొంగరాలపాడు వద్ద కొట్టుకుపోయి మృతి చెందిన వారి కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభ అన్నారు. శనివారం లక్ష్మీపురం గ్రామంలో బాధితుల కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల నష్ట పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, చలమయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ వినాయక్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి



వినాయక్

ఆదిత్య యూనివర్శిటీ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ మూడే వినాయక్ ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'పండ్ల తోటల పంటల కోసం ట్రాక్టర్ మౌంటెడ్ రౌండ్ బేసిన్ మేకర్ కమ్ ఫర్టిలైజర్ అప్లికేటర్' అనే అంశంపై ఆయన సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ లభించిందని ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. డాక్టరేట్ రావడం పట్ల ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, యూని వర్సిటీ ప్రో ఛాన్సలర్. డా.ఎన్.సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, ప్రో. వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమాశ్రీ, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి.రాజేష్, విభాగాధిపతి డాక్టర్ కృష్ణకాంత్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

జెఎన్‌టియుకెలో ఫార్మసీ పార్కు ఏర్పాటు

ప్రజాశక్తి - తాళ్లరేవు



సదస్సులో మాట్లాడుతున్న జెఎన్‌టియుకె విసి మురళీకృష్ణ

జెఎన్‌టియుకెలో రూ.10 లక్షలతో ఫార్మసీ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు జెఎన్‌టియుకె వైస్ ఛాన్సరల్ కెవిఎస్‌జి.మురళీకృష్ణ తెలిపారు. శనివారం కోరంగి ఫార్మసీ కళాశాలలో 'ఎ టాక్ ఆన్ జాయ్ ఆఫ్ లెర్నింగ్' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో స్నేహపూర్వకంగా ఉంటూ అన్ని విషయాలను పంచుకోవాలని అన్నారు. తరగతి గదిలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పక్కనున్న స్నేహితునికి చెప్పడం ద్వారా విద్యలో రాణించగలుగుతారన్నారు. మంచి స్నేహితులను ఏర్పర్చుకోవాలని సూచించారు. నీవు కోల్పోయిన తరగతి పాఠాలను నీకు తిరిగి చెప్పేవాడే సరైన స్నేహితుడని అన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతి అంశం పైన విద్యార్థులు అవగా హనతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. జెఎన్‌టియుకె ద్వారా విద్యార్థులు విదేశాలు సందర్శించే అవకాశం కల్పిస్తున్నామనిచ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జెఎన్‌టియుకెలో రూ.10 లక్షలతో ఫార్మసీ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 200 దేశాలకు చెందిన జాతీయ జెండాలను యూనివర్సిటీలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యాయులు నాగ సుబ్రహ్మణ్యం, నాగరాజు, స్వాతి, శ్రీ వర్ధిని రచించిన టెక్స్ బుక్ ఆఫ్ క్లినికల్ రీసెర్చ్, ప్రిన్సిపల్ మెథడ్స్ అండ్ ప్రాక్టీస్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోరంగి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ సువర్ణ జ్యోతి, డైరెక్టర్ చిట్టూరి కలికి మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం పట్ల హర్షం

ప్రజాశక్తి - కాజులూరు



కళాశాలకు నూతనంగా నిర్మించిన రహదారి

కళాశాలకు వెళ్లే మార్గంలో రహదారిని నిర్మించడం పట్ల గ్రామస్తులు, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. 2004లో కళాశాల ఏర్పాటు అయింది. నాటి నుంచి కళాశాలకు వెళ్లేందుకు సరియైన రమదారి లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వ పాలనలో నాటి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ దృష్టికి విద్యార్థులు, గ్రామస్తులు పలు దఫాలుగా రహదారి అంశాన్ని తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. మండల కేంద్రమైన కాజులూరు ప్రధాన రహదారి నుండి కళాశాలకు వెళ్లే మార్గం లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందికి గురి అయ్యేవారు. 2004వ సంవత్సరంలో ప్రారంభించిన కళాశాలలో రహదారి లేకపోవడంతో అనేక ఇబ్బంది లకు గురయ్యే వారు. గత ప్రభుత్వ హాయంలో అప్పటి రాష్ట్ర మంత్రి వేణుగోపాలకష్ణకు ఎన్ని మార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న వాసంశెట్టి సుభాష్ దృష్టికి ఈ రహదారి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఆయన రహదారి నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఇచ్చిన ఆదేశాలతో అధికారులు యుద్ధప్రాతిపదికన రహదారిని నిర్మించడంతో మాజీ ఎంపిపి యాళ్ళ కృష్ణారావు, జనసేన మండల ఇన్‌ఛార్జ్ ఆన్యం శ్రీరామచంద్రమూర్తి, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



చిన్నారులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న నిర్వాహకులు

సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ అన్నారు. శనివారం ఎస్ఎంఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు పౌష్టిక ఆహార కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు ప్రతి నెల క్రమం తప్పకుండా ఎస్ఎంఎస్ సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. నిరుపేద విద్యార్థులను ఆదుకోవడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని సూచించారు. పేద విద్యార్థులు వారి కుటుంబ సభ్యులకు పడాల శ్రీనివాస్ రెడ్డి మధ్యాహ్న భోజనాన్ని సమకూర్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఎస్ ప్రతినిధులు జి.సత్యానందం, ఎస్‌వి.సోమేశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.

దేవాలయానికి రూ.5.07 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం



యాత్రికులకు భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

శృంగార వల్లభ స్వామి దేవాలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.5.07 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం వివిధ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.3,41,360, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,19,324, కేశఖండన ద్వారా రూ.6,040, తులాభారం ద్వారా రూ.550, లడ్డు ప్రసాదు ద్వారా రూ.39,735 వెరసి రూ.5,07,009 ఆదాయం లభించిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించామన్నారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమా చార్యులు, పెద్దింటి నారాయణ చార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సహాయ సహకారాలు అందించారని తెలిపారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన తుమ్మలపల్లి

ప్రజాశక్తి - జగ్గంపేట


స్థానిక బిఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ సందర్శించారు. పాఠశాలలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్లాస్ రూమ్స్‌లో విద్యార్థులు నేలపై కూర్చుంటున్నారని, 250 బెంచీలు కావాలని, పడుకోవడానికి బెడ్స్ లేక నేల మీద నిద్రిస్తున్నారని, బెడ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఆయా పోస్టులు భర్తీ చేయాలని కోరారు. సోలార్ సిస్టం ఏర్పాటు చేయాలని, పాఠశాల ఆవరణ అంతా తుప్పలు పట్టి పాములు పాఠశాలలోకి వస్తున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అదేశాలతో సాంఘిక సంక్షేమ పాఠశాలను సందర్శిస్తున్నామని అన్నారు. ఈ పర్యటనలో పాఠశాలలో పలు సమస్యలను గుర్తించామని తెలిపారు. రెండు రోజుల్లో పాఠశాల ఆవరణలో ఉన్న తుప్పలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు మరిచే రామకృష్ణ, మాదారపు వీరబాబు, ఎంపిటిసి సభ్యులు దొడ్డ శ్రీను, రాజనాల శ్రీను, మొగలి గంగాధర్, సూరపురెడ్డి నరేష్, గుంటముక్కల చిన్న, గోకాడ రమణ, కోలమూరు బుజ్జి పాల్గొన్నారు.

ఆదిత్యలో షి స్పీక్స్ క్లబ్ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఐసిసి విభాగం ఆధ్వర్యంలో షి స్పీక్స్ అనే క్లబ్ ప్రారంభమైంది. కళాశాల క్యాంపస్ ప్లేసెమెంట్స్‌లో రూ.30 లక్షల ప్యాకేజ్ సాధించిన విద్యార్థినులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ వైకెఎస్.సుబ్బారావు, డీన్ కెరీర్ గైడెన్స్ డాక్టర్ కిషోర్, డీన్ డాక్టర్ సంజీవ్, డీన్ అకాడెమిక్. డాక్టర్ రవికుమార్, డీన్ డాక్టర్ రాఘవేంద్రరావు, ప్రిసైడింగ్ ఆఫీసర్ ఎస్.శ్వేతారాధా పాల్గొన్నారు. ఈ క్లబ్ యొక్క ఉపయోగాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ విద్యార్థులకు వివరించారు.

కార్టూ'నిజం'



మెడికవర్‌లో వాస్క్యులర్ శస్త్ర చికిత్స విజయవంతం

ప్రజాశక్తి - కాకినాడ



రోగితో శస్త్ర చికిత్స చేసిన వైద్యబృందం

స్థానిక మెడికవర్ హాస్పటల్‌లో అత్యంత క్లిష్టమైన వాస్కులర్ శస్త్రచికిత్సను విజయవంతం అయింది. ఈ చికిత్సకు సంబంధించిన వివరాలను శని వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాస్కులర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ అమరేంద్రబాబు వివరించారు. మండపేటకి శ్యామ్‌కుమార్ కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలుకి గాయమైంది. ప్రాథమిక చికిత్స అనంతరం గాయమైన చోట చర్మం నల్లగా, గ్రీన్ లాగా మారిపోయి విపరీతమైన నొప్పి రావడంతో తమను సంప్రదించినట్లు తెలిపారు. సంబంధిత బాధితుడికి సిటి యాంజియోగ్రామ్ చేయించి రెండు కాళ్లకు రక్తప్రసరణ సరిగా జరగడం లేదని గుర్తించినట్లు చెప్పారు. ఆ వ్యక్తి దీర్ఘకాలికంగా బిపితో బాధపడుతున్నాడని, గత 30 ఏళ్ళుగా ధూమపానం సేవించడం వల్ల రెండుకాళ్ళ రక్తనాళాలు పూడికలతో మూసిపోయాయని అన్నారు. రెండు కాళ్లకు రక్తప్రసరణను పునరుద్ధించడానికి తమ బృందం శస్త్ర చికిత్సను చేసి విజయవంతంగా ముగించినట్లు చెప్పారు. ఈ శస్త్రచికిత్సలో బృహద్ధమని (అయోటా) నుంచి కృత్రిమ గ్రాఫ్టులను ఉపయోగించి బైపాస్ సర్జరీ ద్వారా రక్త సరఫరాను రెండు కాళ్లకు చేరేలా చేయటం జరిగింద న్నారు. ఈ శస్త్రచికిత్సను కాకినాడలో మొటమొదటిసారిగా మెడికవర్ హాస్పిటల్‌లో మాత్రమే చేయడం జరిగిందని వివరించారు. అనస్తిసియా వైద్యులు డాక్టర్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ 12 గంటలపాటు చేసిన ఈ సర్జరీలో మత్తు చాలా కీలకపాత్ర పోషించిందని,సర్జరీ జరిగినంత సేపు ప్రత్యక్ష పర్యవేక్షణ చేసినట్లు చెప్పారు. క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి అరుదైన శస్త్ర చికిత్స జరిగిన తర్వాత ఆ వ్యక్తికి క్రిటికల్ కేర్ విభాగంలో అత్యంత జాగ్రత్తగా తగిన వైద్యం అందించడంతో ఆ వ్యక్తి రెండు రోజుల్లోనే రోగిని డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. క్లిష్టమైన శస్త్ర చికిత్స చేయడంలో విజయం సాధించిన డాక్టర్ ఎస్ శ్రీరామఅమరేంద్రబాబుని, ఇతర వైద్య బృందాన్ని సెంటర్ హెడ్ శుభాకారరావు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజాల చిట్టిబాబు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శంఖవరం

సమాజంలో ప్రతి ఒక్క మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రతిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు పిలుపునిచ్చారు. జాతీయ న్యాయ సేవ దినోత్సవం సందర్భంగా శనివారం కత్తిపూడి పంచాయతీ కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకు పెరిగిపోతున్న హింసకాండ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల హక్కులకు, రక్షణకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక చట్టాలను ఆయన వివరించారు. సైబర్ నేరాల పట్ల బాలికలు, యువతులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బిఎస్.చలం, రాయి శ్రీనివాసరావు, కుసుమంచి సూర్యప్రకాశరావు, ఆకాశపు మల్లేశ్వరరావు, బి.రవికుమార్, బి.అశోక్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ -నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారున రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గడ్డి ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న నలుగురు కూలీలు గాయపడ్డారు. శనివారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. రంగంపేట మండలం రాయవరం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ట్రాక్టర్‌పై గడ్డి లోడ్ వేసుకుని గండేపల్లి నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు. గండేపల్లి గ్రామ శివారున ఆ ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న నలుగురు కూలీలు గాయాల పాలయ్యారు. వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎస్‌టి రాజాపురంలో నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అప్పన్నరావు తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.విట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

950 కిలోల రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని ఉండూరు ప్రకాశరావు పేటలో ఒక ఇంట్లో నిల్వ ఉంచిన 950 కిలోల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు శనివారం మండల సివిల్ సప్లై అధికారి కమలకుమారి చెప్పారు. ముందస్తు సమాచారంతో బియ్యం నిల్వ ఉంచిన ఇంటిపై ఎంఎస్ఒ, విఆర్ఒల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. నిర్వాహకుడు శెట్టి లచ్చబాబుపై 6ఏ కేసు నమోదు చేసి బియ్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. కాగా సీజ్ చేసిన బియ్యం విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని చెప్పారు.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసి శనివారం స్థానిక ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సిఐ ఐడి. నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వర పురం మండలాల్లోని వివిధ గ్రామాల్లో మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నారన్న సమాచారంపై ఆయా ప్రదేశాల్లో దాడులు నిర్వహించామన్నారు. ఈ క్రమంలో మండలంలోని చెముడులంక హైవే పక్కన 8 మద్యం బాటిళ్లను కలిగి ఉన్న ఎన్.సీతా రామయ్యను అరెస్ట్ చేసి, వాటిని స్వాధీన పరుచుకున్నాం. అలాగే కపిలేశ్వరపురంలో బెల్ట్ షాపును ఏర్పాటు చేసి మద్యాన్ని విక్రయిస్తున్న ఎన్.తమ్మయ్యను అరెస్టు చేసి అతని దగ్గర ఉన్న 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎక్సైజ్ ఎస్ఐ పి.రాంబాబు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీజిల్ తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

యానాం నుంచి డీజిల్‌ను ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని శనివారం ముమ్మిడివరం పోలీసులు అదుపులోకి తీసుకుని డీజిల్ సీజ్ చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు భీమవరానికి చెందిన గాడా సురేష్ ఆటోలో 330 లీటర్ల డీజిల్‌ను యానాం నుంచి తరలిస్తున్నాడు. ముమ్మిడివరం లో శనివారం ఎస్ఐ జ్వాలా సాగర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా పోలీసులు డీజిల్ ఆటోను పట్టుకుని, డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లికి చెందిన ఒక అవివాహిత మహిళను వేధింపులు, బ్లాక్ మెయిల్‌కు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివనాగు తెలిపిన వివరాల ప్రకారం..ప్రతిపాడు మండలం ధర్మవరం చెందిన డివై.ప్రసాద్ సదరు మహిళను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలు, బాల బాలికలను వేధించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎటిఎం కార్డు మార్చి నగదు అపహరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

మహిళ వద్ద ఉన్న ఎటిఎం కార్డును మార్చి ఒక వ్యక్తి రూ.లక్ష అపహరించాడు. ఈ ఘటనపై శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. ద్రాక్షారామ గ్రామానికి చెందిన కారుమూరి మాణిక్యంబ సెప్టెంబర్ 14న ఎటిఎంలో నగదు తీసుకోవడానికి వెళ్లింది. ఆమె ఎటిఎం కార్డు మిషన్లో పెట్టగా నగదు రాకపోవడంతో తికమక పడుతోంది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె కార్డును ఎటిఎంలో ఉంచి రూ.10 డ్రా చేశాడు. అనంతరం అతడు ఎటిఎం కార్డు ఆమెకు ఇచ్చి వెళ్లిపోయాడు. అతను వెళ్ళిన కాసేపటికి మూడుసార్లు మరో ఎటిఎం నుండి రూ.30 వేలు నగదు డ్రా చేసుకున్నాడు. అనంతరం వివిధ పెట్రోల్ బంకుల్లో మరికొంత నగదు డ్రా చేశాడు. మొత్తం రూ.1,04,800 డ్రా చేసుకున్నాడు. నగదు డ్రా చేసుకున్నట్లు ఫోన్‌కు మెసేజ్‌లు రావడంతో ఆమె ఎటిఎం కార్డు మారిందనే విషయాన్ని గ్రహించింది. దీంతో ఈ ఘటనపై బాధితురాలు శనివారం ద్రాక్షారామం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో బొబ్బిల్లంక గ్రామ పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమె విధులు ముగించుకుని ఇంటికి వెళ్ళారు. అనంతరం మెడికల్ షాపునకు వెళ్ళి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని మృతి చెందారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆగస్టులో ఆమె సీతానగరం మండలానికి బదిలీ అయ్యారు. ఆమె మృతి పట్ల ఎంపిడిఒ భారతి, సిబ్బంది సంతాపం తెలిపారు. చేశారు.

పొలిటికల్ హీట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి


రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలుగుతోందని, అవసరమైతే తాను హోం శాఖను తీసుకుంటానంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా పొలిటికల్ హీట్‌ను పెంచాయి. సాధారణ ప్రజానీకంతో పాటు రాజకీయ నేతల్లోనూ ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఏర్పడటంలో పవన్ కళ్యాణ్ కీలకంగా వ్యవహరించిన విషయం విధితమే. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేనానికి తగిన ప్రాధాన్యత ఇవ్వటంలేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. పవన్ కళ్యాణ్ సూచనలను టిడిపి అధినేత పరిగణలోకి తీసుకోవటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు క్షేత్రస్థాయిలో టిడిపి, జనసేన నాయకుల మధ్య ఘర్షణలు నిత్యకృత్యంగా మారాయి. రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ఘర్షణలు పరిపాటిగా మారాయి. ఈ నేపథ్యంలో తాజాగా జనసేనాని చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాముఖ్యతను పెంచాయి. కూటమిలో నిప్పు రాజుకుందనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేవలం నాలుగు నెలలకే ఈ పరిస్థితి ఉంటే రాబోయే నాలుగేళ్లు ఎలా ఉంటుందనే ఆయా వర్గాల్లో చర్చ ప్రారంభమైంది.

ఎంఎల్‌సి ఎన్నికలకు మోగిన నగారా

ఉపాధ్యాయ ఎన్నికలకు ఎన్నికల నగారా మోగింది. ఈ వారంలో నోటిఫికేషన్ విడుదలైన విషయం విధితమే. జిల్లా వ్యాప్తంగా 16,316 మంది ఓటర్లు ఉన్నారు. మరోవైపు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. రాజకీయ పార్టీలు ఓటర్లను జాబితాలో చేర్చే పనిలో పడుతున్నాయి. ఈ నెల 23 వరకూ ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో ఉన్నత విద్య పూర్తి చేసిన వారి వివరాలను ఇప్పుడు సేకరిస్తున్నారు. పట్టభద్రులను కలవటంతో పాటు ప్రధాన కూడళ్లలో ఓటు నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి నమోదు కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఇప్పటివరకూ పిడిఎఫ్ విజయ ఢంకా మోగించిన విషయం విధితమే. గెలిచిన అనంతరం ఉపాధ్యాయులు, పట్టభద్రుల గళం శాసనమండలిలో వినిపించడంతో పాటు ప్రజా సమస్యలను పరిష్కార దిశగా విశేష కృషి చేశారు. ఈ నేపథ్యంలో కొనసాగించేందుకు పిడిఎఫ్ అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీకి సమాయత్తం అవుతున్నారు.

సిపిఎం ప్రజా పోరు

పెరుగుతున్న అధిక ధరలకు వ్యతిరేకంగా, మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగానూ, జమిలి ఎన్నికలను నిరసిస్తూ సిపిఎం చేపట్టిన ప్రజాపోరు ఈ వారంలో ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమాల ద్వారా పాలకుల వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు ప్రజల గొంతుకై సమస్యలను వెలుగెత్తేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో గత రెండ్రోజులుగా జరిగిన కార్యక్రమాలకు ప్రజలనుంచి విశేష మద్దతు లభిస్తోంది. ప్రజలు భాగస్వాములై తమ మద్దతు తెలుపుతున్నారు. మరోవైపు జమిలి ఎన్నికల పేరుతో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రజాపోరు ముందుకు సాగుతోంది.



అపార్ వ్యవస్థతో సతమతం

నూతన విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో 'అపార్' నమోదుకు తెర తీసింది. త్వరిత గతిన పూర్తి చేయాలని విద్యావ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. విద్యార్థుల పేర్లు ఆన్‌లైన్ చేసే క్రమంలో ఆధార్‌లోనూ, బర్త్ సర్టిఫికెట్‌లలోనూ నమోదైన పొరపాటు ప్రస్తుతం తలపోటుగా మారాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్, పంచాయతీలలో త్వరిత గతిన సవరణలు పూర్తికాకపోవటంతో తల్లిదండ్రులు కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిగణలోకి తీసుకుని అపార్ నమోదు ప్రక్రియ కాలపరిమితి పొడిగించాలని తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - కాజులూరు

మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. శలపాక గ్రామంలో దీపావళి రోజున జరిగిన హత్యోదంతంలో ప్రాణాలు కోల్పోయిన బత్తిల కుటుంబీకులను మంత్రి సుభాష్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ గ్రామంలో చిన్నచిన్న సంఘటనలు జరిగినప్పుడు స్థానికంగా ఉన్న పెద్దలతో కూర్చిని మాట్లాడుకుంటే సరిపోయేదని అన్నారు. అయితే క్షణికావేశంలో బత్తుల కుటుంబంలో ముగ్గురు మృతి చెందడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబీకులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. మృతి చెందిన రమేష్ కుమారునికి రూ.50 వేలను ఫిక్స్డ్ డిపాజిట్ చేయడం జరుగుతుందని, మృతుల భార్యలకు ఉద్యోగ భద్రత కల్పిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతు గనిరాజు, మండల టిడిపి అధ్యక్షులు పేపకాయల బాబ్జి, స్థానిక నాయకులు వల్లు అర్జునరావు, చంద్రు వీర్రాజుచౌదరి, పోతురాజు భీమారావు, అప్పన్న, కోట తాతబ్బాయి పలువురు నాయకులు పాల్గొన్నారు.

సామర్లకోటలో జనసేన సంబరాలు

ప్రజాశక్తి - సామర్లకోట



సంబరాలు చేసుకుంటున్న జనసేన కార్యకర్తలు

కుడా ఛైర్మన్‌గా తుమ్మల రామస్వామి ఎంపికతో జనసేన నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి సంబరాలు నిర్వహించుకున్నారు. స్థానిక మెహర్ కాంప్లెక్స్ సెంటర్ వద్ద రోడ్లపై వాహనదారులను నిలుపుదల చేసి తమ నాయకుడు బాబుకు పదవి కేటాయించడానికి పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జోరుగా బాణాసంచ కాల్పులు చేపట్టి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా నాయకుడు పిట్టా జానకి రామారావు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి సామాన్య కార్యకర్తగా జెండా మోస్తున్న తుమ్మల బాబును గుర్తించి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా ఛైర్మన్ పదవిని కట్టబెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు సరోజ వాసు, నాయకులు మంచం సాయి, పెంకే వెంకటలక్ష్మి, అత్తిలి కృష్ణ పాల్గొన్నారు.

ర్యాలి ప్రసాద్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శేషారెడ్డి

రాజకీయ విద్యా వ్యాపార కళారంగాల్లో స్ఫూర్తి దాయకంగా నిలిచిన రెడ్ల చరిత్రను అందరూ చదువుకునేందుకు వీలైన భాషలో రూపొందించారని ఆదిత్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ నల్లమిల్లి శేషారెడ్డి అన్నారు. ప్రముఖ రచయిత ర్యాలి ప్రసాద్ రచించిన 'ఘన చరితల రెడ్ల సుగుణ శీలురు భూమంచి రెడ్లు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రచయిత ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ శతాబ్దాల కాలం నుంచి తెలుగు జాతికి రెడ్డి ప్రముఖులు అనేక రంగాలలో ఎనలేని సేవలందించారని, వారి కృషిని రేపటి తరాలకు అందివ్వాలనే ఈ పుస్తకం రచించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లమిల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ రెడ్ల ఘన చరిత్రను రచయిత ర్యాలి ప్రసాద్ సవివరంగా అందించారని అన్నారు. సంస్థ కార్యదర్శి ద్వారంపూడి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఆధారాలతో కూడిన చరిత్ర అందరూ చదవాల్సిన పుస్తకమని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఆందోళన చెందవద్దు

ప్రజాశక్తి - తాళ్లరేవు



క్రీడా మైదానంలో నిర్మిస్తున్న నూతన కోర్టులు

ఎస్ఎన్‌వి జడ్‌పి హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో చేస్తున్న నిర్మాణాలపై పూర్వ విద్యార్థులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు ఆందోళన చెందవద్దని హెచ్‌ఎం జొన్నాడ ఆశాలత, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్ర, భానుమతి అన్నారు. పిఎం శ్రీ పథకంలో భాగంగా పాఠశాలలో ఎక్కువ మంది క్రీడాకారులు ఆడే ఆటలకు సంబంధించి కోర్టులు ఏర్పాటు చేసుకోవడానికి తాళ్లరేవు హైస్కూల్ ఎంపికైందని అన్నారు. సోషల్ మీడియాలో హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వాకె శనివారం వివరణ ఇచ్చారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్ వంటి కోర్టులు, లాంగ్ జంప్ పిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌కు ఎటువంటి ఇబ్బంది లేదని, పథకంలో ఉన్న నిబంధనల మేరకు నిర్మాణాలు చేస్తున్నామన్నారు. కోర్టుల నిర్మాణం తర్వాత మళ్లీ మార్పు చేసుకునే వీలుందని అన్నారు.

ఆదిత్య ప్రిన్సిపల్‌కు ఉత్తమ అధ్యాపక అవార్డు

ప్రజాశక్తి - గండేపల్లి



రమేష్ ఆదిరెడ్డి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ ఆదిరెడ్డికి ఎపి ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల లో ఇఇఇ విభాగంలో బిటెక్, ఎంటెక్ చేసి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ చేసిన ఈయన వివిధ హోదాలలో విశేష సేవలు అందిస్తున్నారని అన్నారు. నేడు ప్రిన్సిపల్‌గా ఉన్న డాక్టర్ రమేష్ అదిరెడ్డికి ఆయన శుభాభినందనలు తెలిపారు. ఆదిత్య అధినేతలు డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాసరావు, వివిధ విభాగాల డీన్‌లు, విభాగాధిపతులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది రమేష్‌కు అభినందనలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - సామర్లకోట



వివరాలను తెలుసుకుంటున్న ఆర్‌డిఒ

మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ కె.శ్రీరమణి శనివారం పరిశీలించారు. పట్టణ పరిధిలోని జడ్‌పి బాలిక ఉన్నత పాఠశాలలో 129, 130 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్ల నమోదు కార్యక్రమంపై బిఎల్‌ఒలను ఆరా తీశారు. అలాగే ఎంఎల్‌సి ఎన్నికల దరఖాస్తులపై బ్లాక్ లెబుల్ అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్‌సి ఓట్ల నమోదును వేగవంతం చేయాలని రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులను ఆమె ఆదేశించారు. ఇంకా పోలింగ్ కేంద్రాల్లో వసతులు, ఇబ్బందులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శనివారం విద్యార్థునులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారికి సమీపంగా వసతి గృహం ఉండటంతో విద్యార్థినులు పాఠశాలకు వెళ్లి, వచ్చే సమయంలో రోడ్డు భద్రతపై తీసుకోవలసిన జాగ్రత్తలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ వివరించారు. వసతి గృహ అధికారిని పి.రోజాను విద్యార్థులకు అందిస్తున్న మౌలిక వసతులు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలికల సేఫ్టీ మరియు సెక్యూరిటీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 65 మంది విద్యార్థినులు ఉండడంతో వారు హైస్కూల్‌కు వెళ్లి వచ్చేటప్పుడు మార్గం మధ్యలో ఏదైనా ఇబ్బంది తలెత్తితే తక్షణం డయల్ 100, లేదా సీఐ 9440796529, జగ్గంపేట ఎస్ఐ 9440796569 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

అన్నదాన పథకానికి రూ.25 లక్షల విరాళం

ప్రజాశక్తి - శంఖవరం



ఇఒకు చెక్కును అందిస్తున్న దాతలు

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి ఒక ట్రస్ట్‌కు సంబంధించిన దాతలు రూ.25 లక్షలు విరాళం అందించారు. శనివారం సికింద్రాబాద్‌కు చెందిన గల్లా రోసమ్మ మెమోరియల్ సభ్యులు దీనికి సంబంధించి రూ.25 లక్షల చెక్కును దేవస్థానం ఇఒ కె.రామచంద్రమోహన్‌కు అందజేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - జగ్గంపేట



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కర్నాకుల

జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన భద్రాసి శివ కుటుంబాన్ని ఆదుకోవాలని తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. శనివారం ఎపి రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. అనంతరం తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్‌సిఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, నాయకులు డి.సురేష్, డాన్ శ్రీను, జంపెల్లి దుర్గా, వి.అరవాలమ్మ పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్రస్థాయి ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఎల్‌ఎ

పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ యూత్ అఫైర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆటల పోటీలు స్థానిక బాలయోగి క్రీడా ప్రాంగణం, వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఈ పోటీలను ప్రారంభించారు. పుదుచ్చేరి కరైకల్ మాహే యానాం వ్యాప్తంగా 8 జోన్‌లకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎఒ మునిస్వామి, విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ వైద్యనాథన్, ఇండోర్ స్టేడియం ఇన్‌ఛార్జ్ ప్రకాష్, పిఇటీలు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేయలేదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి. మల్లవరం పంచాయతీ పరిధిలో నిర్మించిన కళ్యాణ మండపంపైన, ఆ వ్యక్తులపైన తాను ఎటువంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు తెలిపారు. శనివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళ్యాణ మండపాన్ని ప్రభుత్వ నిబంధన మేరకు నిర్మించారా లేదా అని ఆర్‌టిఐ ద్వారా అధికారులను కోరినట్లు చెప్పారు. పత్తిగొంది గ్రామానికి చెందిన కొందరు తనపై ఆరోపణలు చేస్తున్నారని, ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఈత మూడి రాఘవ, గర్రె లక్ష్మీనారాయణ, బొమ్మిడి శ్రీనివాస్, టిల్లపూడి సత్తిబాబు, వళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

యానాంలో 21న ముఖ్యమంత్రి, గవర్నర్ పర్యటన

ప్రజాశక్తి - యానాం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి

ఈనెల 21వ తేదీన పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామి, గవర్నర్ కైలాస్ నాదన్, ఫిషరీస్ మినిస్టర్ లక్ష్మీనారాయణలు యానాం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. శనివారం మల్లాడి స్వగృహంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. మత్స్యకారులకు ఒఎన్‌జిసి సంస్థ ద్వారా రావలసిన నష్టపరిహారం తమ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. సిఎస్‌ఆర్ నిధులు ద్వారా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు పుదుచ్చేరి ప్రభుత్వంతో అభివృద్ధి పనులకు కావలసిన అనుమతులు వచ్చినట్లు తెలిపారు. వాటికి సంబంధించి ఈనెల 14వ తేదీన జరిగే శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొంటానని మల్లాడి కృష్ణారావు తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రౌతులపూడి

స్థానిక సిహెచ్‌సి పరిధిలోని పలు గ్రామాలకు చెందిన గర్భిణులకు శనివారం వైద్య అధికారి జానకిదేవి, వైద్యులు డాక్టర్ సునీత, డాక్టర్ పావని, డాక్టర్ సౌమ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రధానమంత్రి సురక్ష యోజన మాతృత్వ పథకంలో ఆసుపత్రి హెడ్ నర్స్ మడకం సరస్వతి ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహారాన్ని అందజేశారు.

ముత్యాలమ్మ ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముత్యాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం, కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక ఆలయం వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, రచ్చ కామేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, టిడిపి నాయకులు నడింపల్లి వినోద్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


పెట్రోల్ బంక్‌లో విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారు కాకినాడ రోడ్‌లోని ఎస్‌ఆర్ బంకులో శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కొలతలు రికార్డులు పరిశీలించి వాటిలో తేడాను అధికారులు గమనించారు. దీంతో 6 ఏ కేసు నమోదు చేసినట్లు ఎంఎస్ఒ వీరాస్వామి తెలిపారు. దీంతో బంక్‌లో ఉన్న 3 వాహనాలు, బంక్‌ను సీజ్ చేసినట్లు సివిల్ సప్లై , విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ తహశీల్దార్ విజయ్ కుమార్, ఎఎస్ఒ లక్ష్మి, లీగల్ మెట్రాలజీ, స్థానిక విఆర్ఒలు పాల్గొన్నారు.

పట్టపగలే వీధిలైట్ల వెలుగులు

ప్రజాశక్తి - పెద్దాపురం



పట్టపగలే వెలుగుతున్న వీధి లైటు

స్థానిక సత్తెమ్మ పేట, చల్లా వారి గురువు వీధి, వేట్లపాలెం పుంత కాలనీల్లో పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణ పరిధిలో వీధిలైట్ల నిర్వహణపై అనేక నెలలుగా సిబ్బంది నిర్లక్ష్యంతో పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నాయి. పేదలు, కార్మికులు నివసించే అనేక ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో లైట్లు వెలగటం లేదనే విమర్శలు లేకపోలేదు. లైట్లు వెలగకపోవటంతో కుక్కలు, పాముల భయంతో ప్రజలు చీకటి పడితే కాలనీల లో తిరిగేందుకు భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణ పరిధిలో పరిశీలన జరిపించి వెలగని వీధిలైట్లను వెలిగించాలని, పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లను సరిచేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.